కథ

తటవర్తి రామచంద్రరావు

# తపోఫలం

**'కర్మణ్యే వాధికారస్తే మాఫలేషు కదాచన**
**మాకర్మ ఫలహేతుర్భూర్మాతే సంగోస్త్వకర్మణి'**

'నీకు కర్మ చేయుట యందే అధికారముంది. దాని ఫలములనందు కాదు. కనుక నీవు కర్మఫలములకు కారణము కాదు. కర్మ చేయకుండుట యందు కూడా ఆసక్తుడవు కాకు.'

ఆచారిగారి గీతాసారాన్ని తనివితీరా తాగుతున్నాడు సత్యం. షాహుకారి బిడ్డ అయినా ధర్మచింతన కలవాడు. చిన్న వయసులోనే జ్ఞానసంపద మీద మక్కువ, ఎదుట మనిషిలోని ఉత్తమ గుణాన్ని ఆకళింపు చేసుకొని గౌరవించే అంతఃకరణ కల మనిషి. పట్నం నుంచి సామాను తెచ్చుకునే ముందు ఆచారిగారికేం కావాలో అడిగి వెడుతుంటాడు. తన ఆయుర్వేద వైద్యానికి సంబంధించిన వస్తువుల జాబితాని ఆయన ఇస్తుంటాడు. సామగ్రి తెచ్చి యిచ్చాక వెంటనే వెళ్ళిపోకుండా ఆయనతో నాలుగు మంచి మాటలు మాట్లాడ్డం సత్యానికి అలవాటు.

ఆవేళ అతను వచ్చినప్పుడు ఆయన దగ్గర్నించి ఎవరో మందు పట్టుకువెళ్ళటం చూసాడు. ''ఎంతివ్వమంటారు బాబూ!'' అని అడిగింది ఆమె.

''ఎంత తెచ్చావు?'' అని నవ్వుతూ అడిగాడాయన.

''ఏం తేలేదయ్యా! ఈ మాటొచ్చినప్పుడు తెద్దారని!'' అంది ఆమె.

''ఇవ్వగలిగినప్పుడు ఇద్దుగానిలే! ముందు మందు వేసుకో! లేకపోతే రేపు పనికి వెళ్ళలేవు'' అన్నాడాయన.

''దేవుడు తమర్ని సల్లగా సూడాల!'' అని చెప్పి వెళ్ళిపోయిందామె.

''ఇలా ఎంతమందికి ఉచితంగా మందులిస్తారు మీరు?'' అని అడిగాడు సత్యం.

ఆయన నవ్వులో నైర్మల్యం నిండి వుంది. ''ఏ ప్రతిఫలమూ లేకుండా నువ్విలా ఎంతకాలం నాకు సరకులు తెచ్చిపెడతావు?''

''అది వేరు. ఇది వేరు. మీరు డబ్బిస్తున్నారు. నేను తెస్తున్నా. దీంట్లో కష్టమేముంది?''

''కాదు. నీ పరోపకార గుణం నీచేత చేయిస్తోంది. దేనినైతే ధర్మమనుకుంటామో అదే కర్మమనుకొని చేయటంలో మనిషి పునీతుడౌతున్నాడు. మనకోసం మనం బ్రతకటంలో గొప్పేమీ లేదు. ఇంకొకరికోసం జీవించటంలోనే సార్థకత వుంది..'' అలా ఎన్నో చెప్పుకుంటూ వచ్చాడాయన. ఆ సందర్భంలోనే ఆ గీతాశ్లోకాన్ని ఆయన ఉదహరించటం జరిగింది.

ధర్మచింతనలో బయట వాతావరణం మారిపోయిందని కూడా వాళ్ళు గుర్తించ లేదు. కుంభవృష్టిగా వర్షం ప్రారంభమైంది. ఈ వర్షంలో దుకాణానికి ఎవరూ రారని సత్యం కావాలనే ఉండిపోయాడు. ''...అయితే ఎక్కడో తపస్సు చేసుకునే మునుల వల్ల, స్వాముల వల్ల సమాజానికి ఏం లాభం?''

''మానవ కళ్యాణం! నీ వ్యాపారంలోనూ రూపాయిల్లో విలువ కట్టలేనిది.''

''మనుషులకి దూరంగాపోయి తమకోసం తపస్సులో మునిగిపోయేవారి కన్నా మనుషుల మధ్య బ్రతుకుతూ మానవ సేవ చేసే వారివల్ల సమాజానికి ఎక్కువ ప్రయోజనం ఉంటుందని నా నమ్మకం!

ఆచారిగారి ముఖంలో మందహాసం. ''మనలోనూ తపస్సు చేస్తున్న వాళ్ళున్నారు!''

సత్యం వదనంలో ఆశ్చర్యం. ''ఎలా?''

''తపస్సు మూడు రకాలు. పెద్దలకి, గురువులకి చేసే సేవ, శారీరక పరిశుభ్రత. క్రమశిక్షణ, బ్రహ్మచర్యం, అహింస మొదలైనవి శారీరకంగా చేయబడే తపస్సులు. ఉత్తమగ్రంథ పఠనం, ఇతరుల్ని బాధపెట్టకుండా మాట్లాడ్డం, సత్యాన్నే పలకటం, నలుగురికీ మంచి చేయటం వంటివి వాక్కు రూపేణా చేసే తపస్సులు. అహంకారం కోపం లేకపోవటం, ప్రశాంతత, ప్రేమ, మౌనం, అణకువ, పరోపకార భావనలతో మనసు నింపుకోవటం మానసికంగా చేయబడే తపస్సులు..ఒక్కసారి నీ చుట్టూ చూడు. కొద్దోగొప్పో ఇలాంటి తపస్సు చేస్తున్న మనుషులు మన మధ్యనే కనిపిస్తారు.''

సత్యం అబ్బురపడుతూ చూసాడు.

''నీ ధర్మ చింతన, నీ మంచిగుణం, నీ నడవడి... ఇతరులకెంత మేలు చేస్తాయో నీకూ అంత శాంతిని ప్రసాదిస్తాయి. ఇంకొకరికి సాయం చేయటంలో నీకెంతో పరమానందం కలుగుతుంది. నీ కడుపు నింపుకున్నప్పుడు కన్న- ఒకరి కడుపు నింపినప్పుడు కలిగే సుఖం, తృప్తి, ఆనందం అనుభవించిన వాళ్ళకే అర్థమౌతుంది...''

''మనసా వాచా కర్మణా మీరింత ఉత్తములే. మరి మీకెందుకిన్ని కష్టాలు?''

''ప్రారబ్దకర్మ బాబూ! అంతే!''

''ఇంతమందికి మీ మందులు పనిచేస్తాయి. అమ్మగారి పక్షవాతం నయం కావటం లేదు. ఎందుకని?''

ఆయన గాఢంగా నిట్టూర్చాడు. అదీ తన ప్రారబ్ద కర్మేనని ఆయన సమాధానం.

''మీకు రావాల్సిన కష్టాలు కావివి'' సత్యం మాటలు పూర్తి కాకముందే- ''దండాలు బాబూ!'' అన్న మాట వినపడింది. ఇద్దరూ అటు చూసారు. వర్షంలో తడిసిన గోనె పట్టాని తలమీంచి తీసింది మంత్రసాని.

''ఏంటి మంగమ్మా ఇంత చీకట్లో వర్షంలో ఇటొచ్చావ్?'' అని అడిగాడు సత్యం.

''పెదరాయుడిగారి కూతురికి పురిటి నెప్పులొత్తున్నాయి బాబూ!''

ఆచారిగారివైపు చురుక్కున చూసాడు సత్యం. ఆయన తొణకలేదు. పలకలేదు. మళ్ళీ సత్యమే అడిగాడు. ''అయితే?''

''పిల్ల బాగా బాధపడుతోందయ్యా! అయ్యగారొత్తే నయమని..''

''ఏం పట్నంలో పెద్ద పెద్ద ఆసుపత్రులమ్మటతిప్పారుగా! ఇప్పుడు రాయుడిగారి ఆచారిగారి వైద్యం కావాల్సొచ్చిందా? సిగ్గులేకపోతే సరి!''

''అంతా కర్మబాబూ! ఇంకో వారం దాకా పురుడు రాదని పట్నంలో సెప్పారంట. చిన్నరాయుడుగారు ఏదో పనెట్టుకొని పొద్దుటేలే కారు తీసుకుపోయేడంట. ఇప్పుడద్దంతరంగా పిల్లకి నెప్పులొచ్చాయి. పట్టం తీస్కెల్లే దార్లేదు. పోను సేస్తే కారు పాడైందని కొడుకు సెప్పాడంట. ఏదో టాసీని తీస్కొత్తానన్నాడంట. మద్దేల ఏరు

పొంగిందో, టాసీ పొడయిందో ఇంతొరకనా పత్తాలేదు. మరో దారిలేక నాకు కబురెట్టారు. గంట తంటాలు పడ్డాన. బిడ్డం అడ్డం తిరిగినట్టుంది. పేణాల మీదకొచ్చింది. అందుకనే అయ్యగోరి కోసం లగెత్తుకొచ్చినా..''

పెదరాయుడు కాదంటే ఊళ్ళో పచ్చగడ్డి కూడా మొలవదు. ఆయన అవునంటేనే అనేకమంది ఇళ్ళల్లో పొయ్యిల్లో పిల్లులు లేస్తాయి. అధికారికంగా అనేక సంవత్సరాలుగా ఊరికి సర్పంచి. అనధికారికంగా మకుటం లేని మహారాజు. ఏదైనా సరే చేయుగల దమ్ములున్నవాడు. సొమ్ములున్నవాడు. అలాంటి వాడు ఇవేళ క్రిందకి దిగి రావాల్సి వచ్చింది. కూతుర్ని పట్నం తీసుకువెళ్ళే దారిలేదు. కర్మకొద్దీ కన్నకొడుకే దారిలేకుండా చేసాడు.

''దేవుడున్నాడని మీరంటే ఏమిటో అనుకున్నాను. ఆ దేవుడున్నాడని ఇప్పుడు తప్పకుండా నమ్ముతాను. రాక్షసజాతిని ఇలాగే అంతమొందించాలి. మీరు మాత్రం వెళ్ళకండి ఆచారిగారూ!'' అన్నాడు సత్యం. కంఠం నిండా కర్కశాన్ని కలియబెడుతూ.

''తప్పు సత్యం! నీలాంటి మంచివాడి నోటి వెంట రావాల్సిన మాటలు కావివి!''

''అంటే! మీ కుటుంబానికి ఘోరమైన అపకారం చేసిన దుర్మార్గుడికే ఉపకారం చేస్తానంటారా?'' అతని గొంతులో ఆశ్చర్యం, అసహనం, బాధ ముప్పేట వేసుకున్నాయి.



ప్రతి రోజూ తన మందుల సంచీని తీసుకొని ఊరంతా రెండుసార్లు చుట్టి వచ్చి తన అవసరం ఎవరికేనా ఉందేమోనని పొటుపడే ఆచారిగారికి తీరని అపకారం పెదరాయుడివల్ల జరిగిందని ఊరందరికీ తెలుసు!

ఊళ్ళో పెద్ద స్కూలు పెట్టిద్దామని ప్రభుత్వం తలబెడితే... అందరూ చదువుకుంటే ఆలోచించే వాళ్ళు ఎక్కువవుతారని..భవిష్యత్తులో తన అధికారానికి అది ప్రమాదమని దాన్ని రాకుండా చేసాడు పెదరాయుడు. కానీ తన కొడుకు, కూతురు పట్నంలో చదువుకొనే ఏర్పాట్లు చేయటంలో ఏమాత్రం ఏమరలేదు!

కొడుకు డింకీలు కొడుతూ ఒకే తరగతిని రెండేళ్ళు చదువుతూ నెట్టుకువస్తున్నా..భవిష్యత్తులో కాబోయే రాజకీయ నాయకుడికి చదువంత ముఖ్యం కాదని సరిపెట్టుకున్నాడు. పట్నం మోజులో కూతురు సుశీల చదువుకుంటానంటే తర్వాత ఏ వ్యాపారస్తుడికో ఇచ్చి పెళ్ళి చేయటానికి అన్నివిధాలా బావుంటుందని దానికీ సరేనన్నాడు. కోరికలకి అంతస్తుండచ్చేమో కానీ ఆశయాలకా తేడా ఉండదు కదా! ఆచారిగారి ఒక్కగానొక్క కూతురు గౌరి పట్నంలో చదువుకుంటానంటే 'శుభ్రంగా పెళ్ళి చేసి అత్తారింటికి పంపించక తలకు మించిన భారమెందుకయ్యా మీకు?' అని ఆయనకి మాత్రం ఉచిత సలహాని పారేసాడు పెదరాయుడు. కేవలం పిల్ల చదువుమీద ఆసక్తి చూపిస్తోందని ఆయన ఆశపడ్డాడేకాని..తర్వాత అదే ఆమెకు ప్రాణాంతకమౌతుందని ఏమాత్రం ఊహించినా అందుకు సిద్ధపడేవాడు కాదు!

పల్లెలో ఉన్నప్పుడు గౌరిని ఎన్నోసార్లు చూసాడు చినరాయుడు. బక్కగా ఉండే ఆ పిల్లని అక్కడంతగా పట్టించుకోలేదు. పట్నం వచ్చాక తన చెల్లెలితోపాటు చదువులో ఎదిగిన గౌరి అందంగా ఆకర్షణీయంగా తయారైంది. పల్లెకీ పట్నానికీ మధ్య

ప్రయాణాల్లో కలిగిన పరిచయం స్నేహంగా బలపడింది. తన చెల్లెలితోపాటు ఆమెకీ పండగలకనీ, పుట్టిన రోజులకనీ కానుకలు కొనిచ్చేవాడు. వయసు ప్రభావం. క్రమేణా ఇద్దరి మధ్యా ఆకర్షణ పెరిగింది. ఒకే వూరి వాళ్ళని ఆ పిల్లతో తన అన్న అంత చనువుగా ఉన్నాడని సుశీల అనుకుందే కాని... వారిద్దరి మధ్య ప్రేమ బంధం ఏర్పడుతోందని ఏమాత్రం ఊహించలేకపోయింది.

ఈనాటికీ పల్లెటూళ్ళో కులాల పట్టింపులెక్కువ. అందులో వాళ్ళిద్దరి మధ్య అంతస్తుల అగడ్త కూడా ఉంది. భవిష్యత్తులో కాబోయే సర్పంచిగా రంగుల కలలు కంటున్నాడు చినరాయుడు. ఆ కలల్లో పాలు పంచుకుందాం రమ్మని గౌరిని నమ్మించాడు. ఒక బలహీనమైన సందర్భంలో కాలుజారింది. కూడదీసుకునే లోగా నెల తప్పింది. ఊళ్ళో తండ్రి పరువు ప్రతిష్ఠలకి వెల తప్పే పని చేసింది. నిజం తెలిసాక "అమ్మో! నాన్నకి తెలిస్తే చంపేస్తాడు" అని వెనకడుగు వేసాడు చినరాయుడు. తన వొంటి మీద చెయ్యి వేసే ముందు తండ్రి అనుమతి అక్కర్లేకపోయిన ఆ ప్రబుద్ధుడు ఇప్పుడు పెళ్ళికి ఆయన అనుమతి కావాలన్నాడు. "పోనీ, ఇప్పుడేనా ఆయనకు చెప్పు" అని తను ప్రాధేయపడింది.

"చదువు పూర్తి కాకుండా ఎలా?" అన్నాడు.

"కడుపులో పెరుగుతున్న బిడ్డ సంగతేమిట"ని నిలదీసింది.

"ప్రస్తుతానికి మందు మింగి వదిలించుకోవటమొక్కటే దారి" అని ఆ మందుని తానే తెచ్చిపెడతానన్నాడు. ఆ 'ఉదారత'ని తను భరించలేకపోయింది. చెల్లెలితో నిజం చెప్పేసింది.

"ఏమిట్రా అన్నా ఈ ఘోరం?" అని సుశీల అడిగితే "ఇలా అవుతుందని నేననుకున్నానా? దీంట్లో అంతా నాదే కాదు. దానిదీ తప్పుంది. గప్‌చిప్‌గా మందు మింగమంటే దానికింత గొడవేంటి?" అని చెల్లెలి పైనే విసుక్కున్నాడా ఘనుడు! గత్యంతరం లేక స్నేహితురాలి మీదున్న అభిమానంతో జరిగిందంతా తల్లి కాంతమ్మకి చెప్పేసింది సుశీల. దాంతో ఆ యింట్లో శతఘ్నులు పేలాయి!

ఉన్నపాటున ఆచారిగారికి కబురంపాడు పెదరాయుడు. ఇంట్లో ఎవరికేనా అనారోగ్యమేమో అని అనుకుంటూ మందుల సంచీతో సహా వచ్చిన ఆయనకి రాయుడు విసిరిన మాటలు రాళ్ళల్లా తగిలాయి. "పండగలకి గుళ్ళో పురాణం చదువుతావు. అందరికీ గీతాబోధ చేస్తావు. వైద్యం చేస్తావు. ఊళ్ళో అందరిచేతా మంచివాడివని పేరు తెచ్చుకున్న వంశం నీది. నీ కూతురు ఇంత అప్రతిష్ట పని చేస్తే ఎలా ఊరుకున్నావయ్యా?"

"మీరనేదేమిటో నాకర్థం కావటం లేదు" వెలవెలబోతూ చూసాడాయన. "నిజంగానే నీకు తెలీదా?" ఎప్పుడూ 'మీరు' అని సంబోధించే పెదరాయుడు అగౌరవంగా 'నువ్వు' అని అంటుంటేనే ఏదో ఘోరం జరిగిందని ఆయనకర్థమైంది. తనకేం తెలియదని తన కూతురు చేసిన తప్పేమిటని అడిగాడు.

"వద్దు వద్దంటే పట్నం పంపించావు. నీ కొంప ముంచింది. ఎవడితోనో ప్రేమ కలాపాలాడింది. ఇప్పుడు కడుపొచ్చింది.."

ఆచారిగారి నెత్తిన పిడుగులు పడ్డాయి. "రాయుడుగారూ!.."

"మా సుశీలతో చెప్పుకుని ఏడ్చింది కనుక నీతో చెప్పాల్సొచ్చింది. ఆ కడుపు తీయించి గుట్టుచప్పుడు కాకుండా పెళ్ళి చేసెయ్. కావాలంటే నేను డబ్బిస్తా!"

ఏదో ఘోరం జరిగిందని ఆయనకి అర్థమైంది. హుటాహుటిన పట్నానికి పరుగెత్తి హాస్టల్లో ఉన్న కూతుర్ని కలిసాడు. తనని చూస్తూనే కూతురు తల దించుకునేసరికి ఎంతోకొంత అర్థమైంది ఆయనకి. "మీ అమ్మ నిన్ను చూడాలంటోందమ్మా!" అని వంక పెట్టి గౌరిని ఇంటికి తీసుకు వచ్చాడు. బయట ఎవరికీ వినపడకుండా అర్ధరాత్రి వేళ అసలు విషయం అడిగాడు. "నన్ను పెళ్ళి చేసుకుంటానన్నాడు నాన్నా!" అని బావురుమంది గౌరి. ఇంకేమనగలడు?

...ఏదో చివరి ఆశతో మర్నాడు పెదరాయుడి దగ్గరికి వెళ్ళి తనగోడు వెళ్ళబోసుకున్నాడు. అంతే! పెదరాయుడు అగ్గిమీద గుగ్గిలంలా మండిపడ్డాడు. "నా ఆస్తిమీద కన్నేసి నా కొడుకు మీద ఇంత అభాండం వేస్తున్నావా? బీసన పుట్టుక పుట్టావు. కులసంకరం చేసుకోవాలన్న ఎదవ బుద్ధేంటి నీకు?"

అన్ని అవమానాలకీ సిద్ధపడి వచ్చిన ఆయన "...మీ సంపద మీద నాకెలాంటి ఆశా లేదు. మీరు కావాలంటే రేపటికి రేపు ఊరు విడిచి వెళ్ళిపోతాను. కానీ అంత మాట మాత్రం అనకండి. అబ్బాయిని పిల్చి ఒక్కమాట అడగండి. నిజానిజాలు తెలుసుకొని న్యాయం చెయ్యండి" అన్నాడు.


"ముందు ముందు ఊర్ని ఏలే మావోడెక్కడ? నీ కూతురెక్కడ? ఒకేళ నీ కూతురు చెప్పింది నిజమే అయినా..ఆడికిచ్చి పెళ్ళి చేస్తానా? కావాలని ఎవడేనా దరిద్రాన్ని ఇంట్లో తెచ్చి పెట్టుకుంటాడా?"

అతను కురిపించిన అనరాని మాటల బరువుని మోసుకొని ఇంటికి వచ్చిన తండ్రిని చూసి హతాసురాలైంది గౌరి.

"నీకింత అప్రతిష్ఠ తెచ్చిన నాకు చిటికెడు విషం ఇచ్చెయ్ నాన్నా! గుట్టు చప్పుడు కాకుండా చచ్చిపోతాను"

అయోమయంగా ఉన్న ఆ క్లిష్టపరిస్థితిలో కూడా- "అంత పని చెయ్యకు తల్లీ! మనమే ఈ వూరు విడిచి వెళ్ళిపోదాం" అని ఎన్నో విధాల కూతురికి ధైర్యం చెప్పాడాయన.

చదువు మానేసి ఇంట్లో కూర్చున్న కూతురి గురించి అనేకమంది వేసే ప్రశ్నలకి ఆయన భార్య కౌసల్య తట్టుకోలేకపోయింది. మనశ్శాంతి కోల్పోయి మంచానపట్టి పక్షవాతానికి గురయింది. ఆ పరిస్థితుల్లో ఊర్నించి కదిలి తెలియని చోటుకి వెళ్ళగలిగే ఆర్థిక స్తోమతు కూడా ఆయనకి లేకపోయింది. ఎక్కడికెళ్ళినా తను తల్లిదండ్రులకి భారమౌతానని, తను తెచ్చిన కళంకంతో వారి బ్రతుకులు దుర్భరమౌతున్నాయని అనుకుందో ఏమో.. పట్నం వెళ్ళి హాస్టలు నుంచి తన పుస్తకాలు తెచ్చుకుంటానని నమ్మబలికి వెళ్ళిన గౌరి ఆ రాత్రికి తిరిగి రాలేదు. మర్నాడు ప్రొద్దున్న రైల్వే లైను మీద పడివున్న శవం తన కూతురిదేనని పోలీసులు వచ్చి చెప్పేవరకూ ఆ పిల్ల ఆఘాయిత్యం చేసిందని ఆయనకి తెలిసి రాలేదు. హాస్టలుకి వెడుతూ పట్టాలు దాటబోతూ ప్రమాదవశాత్తూ చనిపోయిందని పోలీసులు రిపోర్టులో రాసి కుటుంబానికి కళంకం రాకుండా ఆయన్ని కాపాడినా..ఆ నిప్పులాంటి నిజం ఆ చెవులా ఈ చెవులా ఊరందరికీ తెలిసిపోయింది!




చినరాయుడు చేసిన ఘోరాన్ని మౌనంగా భరించిన ఆచారిగారు పెదరాయుడి పరువు ప్రతిష్ఠలకెప్పుడూ అవరోధం కాలేదు. కూతురి వియోగంతో, భార్య అనారోగ్యంతో ఆయనకి రోజులు భారంగా గడిచినా..పెదరాయుడికి నాలుగు సంవత్సరాలు ఇట్టే గడిచిపోయాయి! తన కూతురు అలాంటి పని చేస్తుందని భయపడ్డాడో

ఏమో- ఆ పిల్ల చదువు పూర్తికాకుండానే ఓ పెద్ద బిజినెస్‌మన్ కొడుక్కిచ్చి పెళ్ళి చేసేసాడు. క్రిందటేడు మండలం ప్రెసిడెంటు కూతుర్ని కోడలుగా తెచ్చుకొని ప్రస్తుతం చినరాయుడికి భావినేతగా తర్ఫీదునిచ్చే పనిలో మునిగి ఉన్నాడు. ఇంత పలుకుబడి, అంతస్తు, సంపద, సౌకర్యాలు ఉన్న ఆ స్థితిమంతుడు ఇలా ఈరోజు ఒక ప్రమాదం తన కూతురి మీదకి వచ్చివాలుతుందని ఏనాడూ ఊహించలేకపోయాడు!

సత్యం వేసిన ప్రశ్నకి ''ఎవరికో చేసే ఉపకారం కాదు. ఇది మానవధర్మం!'' అంటూ లోపలికి వెళ్ళి మందుల సంచీని చేతబట్టుకున్నాడు ఆచారి గారు.

బయట జరుగుతున్న సంభాషణని వింటూనే ఉంది కౌసల్య. ''వెళ్ళిరండి. ఆ పిల్లని కాపాడండి'' అంటూ కనిపించని దేవుళ్ళతోపాటు ఆయనకే దండం పెట్టింది.

ఆయన హృదయం ద్రవించి కనుకొలకుల్లోకి ఓ చినుకు చిందింది. ''వచ్చేటప్పటికి ఆలశ్యమౌతుందేమో!'' అని రెండు అరటిపళ్ళు ఆమె పక్కన పెట్టి బయటికి నడిచాడు.

''విన్నారా! మిమ్మల్ని తీసుకు రమ్మని పెద్దరాయుడు చెప్పలేదంట. తనే వచ్చింది మంగమ్మ. ఇలాంటి పరిస్థితిలో కూడా ఆయనకెంత అహంకారమో చూడండి. అలాంటి రాతి మనిషికి ఉపకారం చేస్తారా మీరు?'' సత్యం గొంతులో ఆవేశం.

''ఎవరు పిలిచారని కాదు. ఎవరికి మనం సహాయం అవసరమన్నది ప్రధానం! చదువుకోని మంగమ్మ ఎంత బాధ్యత తలకెత్తుకుని వచ్చింది! ఆమెను చూసయినా మన ధర్మం మనం తెలుసుకోకపోతే ఎలా?''

గంభీరమైన ఆయన మాటలకి అవాక్కయిపోయాడు సత్యం.

''ఎప్పటికి రాగలనో..''

సత్యం చకితుడయ్యాడు...''మీరొచ్చేవరకూ నేనిక్కడే ఉంటాను''

ఆయన ముఖంలో చిరునవ్వు..''నాకు తెలుసు. నువ్విలా అంటావని'' అంటూ ఆప్యాయంగా అతని భుజం మీద చెయ్యి వేసి కదిలాడు.

చిరుగుల గొడుగులో తడిసి వచ్చిన మనిషి ఎవరో ఇట్టే గుర్తించాడు పెదరాయుడు. ''ఎక్కడికి పోయావే?'' అని మంత్రసానిని తిడదామనుకున్న నోరు ఆచారిగార్ని చూసి అట్టే ఆగిపోయింది.

నాలుగేళ్ళుగా ఆయన్ని ఎప్పుడూ ఇంటికి పిలిపించి ఎరుగడు. డబ్బు విరజిమ్మి పట్నంలో పడిశానికి కూడా వైద్యం చేయించుకునే ఆ స్థితిమంతుడికి ఆయన అవసరం ఇంతకాలంగా రాలేదు. కానీ, ఇవేళ ఆ డబ్బు కూతుర్ని ఆపద నుంచి రక్షించలేకపోతోంది. కర్మకొద్దీ కన్నకొడుకే కూతురికి ప్రాణాంతకమైన పని చేసాడు. అంతటి క్లిష్టపరిస్థితిలో కూడా జరిగినదంతా తెలిసి తనని హేళన చేయటానికి ఆచారిగారు వచ్చాడేమోనని అనుమానంగా చూసాడే కానీ ..పిలవకపోయినా ప్రాణదాతగా వచ్చిన మనిషని గౌరవించేలా కుర్చీలోంచి లేవలేదు!

జన్మ సంస్కారంతో ''రండి బాబూ!'' అంటూ గుమ్మంలో ఎదురొచ్చిన కాంతమ్మ కాళ్ళకి నీళ్ళిచ్చేసరికి ''మరేం భయపడకండమ్మా!'' అని ధైర్యం చెప్పాడు ఆచారిగారు.

''అయ్యో! మీరు తడిసిపోయారు. పొడి బట్టలు తెస్తానుండండి'' అంది ఆమె.

''అవంత ముఖ్యం కాదమ్మా! ముందు పిల్ల సంగతి చూడాలి. వెంటనే వేన్నీళ్ళు కావాలి''

''నీళ్ళు, నూనె..అన్నీ సిద్ధంగానే ఉంచానండయ్యా!'' అంది మంగమ్మ తడిసిన తన బట్టల్ని బయట పిండుకుంటూ.

మంగమ్మ హస్తవాసి, ఆచారిగారి మందుల ప్రభావం, వారిద్దరి నిస్వార్థ సేవ..రెండు గంటల పాటు వాళ్ళు చేసిన అవిరళకృషి ఫలించాయి. సుశీల ప్రాణం నిలిచింది. ఇదే కారు వుండి వుంటే చటుక్కున సిజేరియన్ చేసి పురుడుపోసి వేలు పోగేసుకుని వుండే వారు పట్నం డాక్టర్లు! కాని, పెదరాయుడికి పైస ఖర్చు లేకుండా, ఎలాంటి అవాంతరం లేకుండా-పిల్ల కొంచెం కష్టపడినా-పండంటి బిడ్డని కన్నది!

''మావల్ల మీకు తీరని అపకారం జరిగింది. మీ ఉసురు మాకు తగిలి నా బిడ్డ ప్రాణాల మీదకి వచ్చిందని ఇంతసేపూ హడలిపోయాను. ప్రమాదం ముంచుకు వస్తున్నా మిమ్మల్ని పిలిపించటానికి నాకు మొహం చెల్లలేదు. తనే పిలుచుకు వస్తానని మంగమ్మ మీ దగ్గరికి వచ్చింది. మీ ఋణం ఎలా తీర్చుకోవాలో నాకు తెలీటం లేదు'' ఆర్ద్రత నిండిన స్వరంతో కృతజ్ఞతనీ, పశ్చాత్తాపాన్నీ కలబోసి వెళ్ళబోసింది కాంతమ్మ.

''నాదేముందమ్మా! అంతా ఆ భగవంతుడి దయం. రేపుప్రొద్దుట ఈ మందు వేయండి. ఏదైనా అవసరమైతే కబురుపెట్టండి'' అంటూ బయటకు నడిచాడు ఆచారిగారు.

''కాదనకండి'' అంటూ వెండి పళ్ళెంలో పంచెల చాపు, చీర పెట్టి ఆయన ముందు పెట్టింది కాంతమ్మ సంశయిస్తూనే!

''మీకభ్యంతరం లేకపోతే...ఈ చీర తీసుకుంటాను''

ఆమాత్రానికే ఆనందపడింది ఆమె. ''ఎంత మాట!''

మెట్లు దిగి వీధి అరుగుక్రింద నిలబడిన మంగమ్మ చేతిలో ఆ చీరని పెట్టి కాంతమ్మకి నమస్కారమో- ఆశీర్వచనమో తెలియని విధంగా చేతులెత్తి అభివాదం చేసాడాయన.

ప్రమాదం తప్పి ఇంట్లో ప్రమోదం నర్తిస్తున్న వేళ ఆనందోత్సాహంతో గెంతులు వేయవల్సిన పెదరాయుడు అపరాధభారంతో పైకి లేవలేక ఇంకా అలాగే కుర్చీలో కూలబడి కూర్చుండిపోయాడు.

ఆ యింట్లో అందరి మనసుల్లో దీపం వెలిగించిన ఆచారిగారు తడి ఆరిన పొడి బట్టలతో చినుకులు తగ్గిన ఆ చీకటిలో తనే ఒక జ్యోతిలా వెలుగులు వెలార్చుతూ తన యింటి వైపు నడిచి వెళ్ళిపోయాడు!

వారం రోజుల తర్వాత...

''ఏమండీ!'' అని భార్య గట్టిగా పిలిచేసరికి ఆమెకేం కావాలో అని ఆత్రుతగా బయట నుంచి లోపలకి పరుగున వెళ్ళాడాయన. అంతవరకు ఆయనతో మాట్లాడుతున్న సత్యం ''ఏమి జరిగిందా?'' అని కంగారుగా తనూ లోపలికి వెళ్ళి చూసాడు.

ఆ దృశ్యం అత్యద్భుతమనిపించింది. వింత అనుభూతితో ఇద్దరికీ ఒళ్ళు పులకరించింది. భర్త ఆసరా లేకుండా ఏడాదిగా మంచానికతుక్కుపోయి బ్రతుకుతున్న కౌసల్య..తనంతట తను పైకి లేచి కూర్చుని వుంది!

''విసనకర్ర చేజారిపడిపోయింది. పిల్చి మిమ్మల్ని ఇబ్బంది పెట్టటమెందుకని వొరిగి తీసుకోబోయానంతే!..'' అంటూ నవ్వుతూ..ఏడుస్తూ..ఆమె ఇంకా ఏదో చెప్పుకుపోతూంటే అది కలా నిజమా...అని గురుశిష్యులిద్దరూ ఆనందభాష్పాలతో చూస్తుండిపోయారు!

